# సింగిల్ పేజీ కథలు

''హల్లో... పోలీస్ స్టేషన్? నేను గాంధీనగర్ నుండి మాట్లాడుతున్నాను. ఇక్కడ మెయిన్‌రోడ్‌లో ఉన్న బంగళా నుండి ఏవో అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి, ఎవరినో చావబాదుతున్నట్టు. త్వరగా రండి. ప్లీజ్''

''ఇంటి నెంబరు ఏమిటి?''

గబగబా ఇంటి నెంబరు చెప్పి ఫోన్ పెట్టేసింది వసంత!

★ ★ ★

రయ్యిన వచ్చి ఆగింది పోలీస్ జీపు. గబగబా, బిలబిలా వచ్చేశారు పోలీసులు. గేట్ చప్పుడు చెయ్యకుండా, గోడ మీదుగా మెల్లగా కాంపౌండ్‌లోకి దిగారు. లోపలేం జరుగుతోందోనన్న ఆత్రుత, కుతూహలం ఎక్కువయ్యాయి.

ఏ విపరీతమూ జరగక ముందే రంగంలోకి దిగాలన్న కార్యదక్షత మొహాలమీద. చప్పుడు చేయకుండా పిల్లి నడకలు నడుస్తున్నారు. ఫోన్‌లో చెప్పిన ఆ చప్పుళ్ళు ఏమీ వినిపించటం లేదు. పని ముగించి వెళ్ళిపోలేదు కదా హంతకుడు?

ఆలోచిస్తూ కిటికీల్లో నుండి లోపలికి చూస్తున్నారు. వెనకవైపునున్న రూమ్‌లోకి తొంగిచూసిన పోలీసు మెల్లగా సైగలతో పిలిచాడు మిగతావారిని. అందరూ కిటికీలో నుండి లోపలికి చూసారు.

రతీమన్మథుల పెయింటింగ్ చూస్తున్నట్టుగా ఎదురుచూడని ఆ దృశ్యం అందరినీ కితకితలు పెట్టింది. పోటీగా ఒకరిమీద ఒకరు వంగిపోయి లోపలికి చూస్తున్నారు. ఆ తోపుడులో పూల కుండీ కిటికీ నుండి దబ్బున పడింది. ఒక్కసారి ఉలిక్కిపడి ఈ లోకంలో పడ్డారు బెడ్‌రూమ్‌లోని వారిద్దరూ! కిటికీవైపు తలెత్తిచూసిన వాళ్ళ కళ్ళు పెద్దవయ్యాయి. తప్పు చేసినట్టు తలలు దించుకున్నారు పోలీసులు.

హెడ్ కానిస్టేబుల్ గంభీరంగా తలపంకించి ముఖద్వారం వైపు నడిచాడు, ఫోన్‌కాల్ విషయం తెలుసుకుందామని!

ఎర్రబడ్డ మొహంతో తలుపుతీసాడు ఆ ఇంటి పెద్ద మనిషి. ''కిటికీల్లోకి తొంగి చూసారని మీమీద పరువునష్టం దావా వేస్తాను తెలుసా..?''

## సబల

కఠినంగా, న్యాయాన్ని తన చేతుల్లో ఇరికించుకున్నట్టు, ధైర్యంగా పలికింది అతని గొంతు.



ఇంటి బయట పోగైన జనం అతని బి.పి.ని మరీ పెంచేసారు. ఖాకీ బట్టలు ఎర్రటోపీ ఆకర్షణే వేరు జనానికి. ఇంటిచుట్టూ గుమిగూడారు.

''ఈ ఇంట్లోంచి, అరుపులు, కేకలు వినిపిస్తున్నాయని, ఏదో దారుణం జరుగుతోందేమోనని మా స్టేషన్‌కి ఫోన్ వచ్చింది. మా డ్యూటీ తక్షణం నిజానిజాలు తెలుసుకోవటం. పరువునష్టం దావా ప్రశ్నేలేదు'' వివరించాడు ఎస్.ఐ.

''అలాంటిదేం లేదు. కావాలంటే ఇల్లు తనిఖీ చేసుకోండి'' అన్నాడు ఆ పెద్ద మనిషి.

''ఎవరి మాకలాంటి ఫోన్ కాల్ ఎవరు చేసుంటారబ్బా? మీకు పడనివారెవరైనా ఉన్నారా? ఆట పట్టించటానికీ, మా టైం వేస్టు చేయటానికి?'' విసుగ్గా అన్నాడు పోలీస్.

''నేను చెప్తాను సార్..!?'' బయట నుండి ఒక గొంతు. గేట్ తీసుకుని లోపలికి వస్తున్న ఆమెను చూస్తూనే అతని కళ్ళు ఎర్రబడ్డాయి. బెదిరిస్తున్నట్టు చూసాడు. లెక్ఖ చెయ్యనట్టు తల ఎగరేసింది.

''నా పేరు వసంత. ఈయన నా మాజీ ఆఫీసర్. ఇది అతని ఆఫీస్ గెస్ట్‌హౌస్. లోపలున్నది ఆయన స్టెనో!''

''సార్... నేను ఈయన ఆఫీస్‌లో పనిచేస్తున్నప్పుడు రోజూ నన్ను ఎంత వేధించుకు తిన్నాడో చెప్పలేను. అవసరంవల్ల నేను ఉద్యోగం చేస్తున్నాను కానీ అమ్ముడుపోవటానికి కాదు అని ఎన్నిసార్లు చెప్పినా వినకుండా కామంతో నన్ను కుళ్ళపొడిచాడు. అతనికి లొంగని నన్ను అనేక విధాలుగా టార్చర్ చేసాడు. నా పేరుకు అసభ్యత నంటగట్టాడు, నాకొచ్చిన సంబంధాల్ని చెడగొట్టాడు. కట్టుకథలైనా, శుద్ధ అసంగతాలైనా ఆడపిల్లని గురించిన ప్రతి గాలిమాటను నమ్ముతుంది ఈ సమాజం. అందుకే నాకు చెడిపోయినదాన్ననీ, ఆఫీస్ గెస్ట్‌హౌస్‌ను తన వ్యసనగృహంగా మార్చిన ఈయన్ని పురశ్రేష్ఠుడని పొగుడుతుంది ఈ లోకం.

కోర్టులు, కేసులు, న్యాయాలు, న్యాయవాదులూ వీటన్నిటి నుండి మామూలు ఆడపిల్లకి న్యాయం అందటానికి ఎంతకాలం పడుతుంది? మామూలుగా చెపితే నా గోడు వినే నాథుడు ఎవరు? ఈ పరిస్థితిలో చూసిన మీకు అర్థం అయ్యే ఉంటుంది. ఇంట్లో ఉన్న ఆ అమ్మాయి పరిస్థితి. ఇంతమంది ముందు నేను నేర్పిన పాఠం ఇతనికి ఎప్పుడూ గుర్తుండి, ఇకముందైనా ఆడపిల్లల్ని గౌరవించటం నేర్చుకోవాలి. దానికి సాక్షులు మీరూ, వీరందరూ..! ఫోన్ చేసి మిమ్మల్ని డిస్టర్బ్ చేసానని, మిస్ లీడ్ చేసానని నేను సారీ చెప్పటం లేదు. సమాజంలో ఏ మూల కుళ్ళు ఉన్నా, దాన్ని నిర్మూలించగల శక్తి మీ పోలీస్ వ్యవస్థకుంది. అందుకే ఇలా చేసాను!''

అందరి చప్పట్లు, ఆఫీసర్‌కి చెంప దెబ్బల్లా తగిలాయి.

**-అంబికా అనంత్**
(బెంగుళూరు)